

# కవలపిల్లలు

అది వేసవికాలం అందులో రోహిణీ కార్తి. రోడ్లు పగిలిపోతున్నాయ్ వేడి గాడ్పులు వీధులవెంట విహరిస్తున్నాయ్. రుంయ్, రుంయ్ మని ఈలపాటలు పాడుకొంటూ కరుణాశూన్యములయినవి అరుణ కిరణాలు అనుదినం అరుస్తున్నా కోవిల కంఠం సన్నగిలింది. కమలాకరుని కాఠిన్య తకు సహించలేక కన్నీటిధారలన్నట్లు కష్టజీవులకాయాల్నుండి జలజలా రాలుతున్నాయ్ చెమట బిందువులు.

ఉదయం పదిగంటలమొదలు ప్రారంభం—మంచి గంధం వంటి నిండా పూసుకొంటూ, చన్నీళ్ళు చల్లిన విసనకర్రలతో విసరుకొంటూ మళ్ళీ సాయంత్రం నాల్గంటలకు గాని గడపదాటరుకల్గినవారు ఆ ఎండకు జడిసి.

బీదవాళ్ళకూ, బిచ్చగాళ్ళకూ అల్లా సాగుతుందా మరి!

అతి తీక్షణంగా ఉందా రోజు ఎండ. పదకొండవుతూ వుంది టైము. పలుచబడుతుంది ప్రయాణికుల సంఖ్య. వేమగిరిలో అదో వీధి, ఆ వీధిలో ఓ యింటిముందు పదమూడేళ్ళఅమ్మాయి, లెక్కపెట్టడానికి సుళువుగా కనిపిస్తున్నాయ్ పక్కటెముకలు. అందమంతా అమ్మాయిలో వున్నట్లు బంగారు తీవెల్లా మెరుస్తున్నాయ్ నూనె రాయకపోవడంచేత, వెంట్రుకలు.

"బాబయ్యా! ఆకలౌతుందండీ, బాబూ! మాదా కబళం పెట్టించండీ!" అంది రెండడుగులు ముందుకువేసి.

"..................................."

నోరారుకు పోతుంది. నాలుకతో పెదిమలు తడుపుకొని గొంతుక సవరించుకొని "మాదా కబళమయ్యా!" అన్నది అనలేక.

ఈ దీనాలాపాన్ని ఆలకించేవారేలేకపోయారు ఆ యింటిదగ్గర. రక్త బిందువులు రాలాయి కళ్ళెంబడి అమ్మాయికి. కాస్తముందరికి నడిచింది ప్రక్కగది కిటికీ దగ్గరకు.

యింటి యజమాని కాటోలు కూర్చున్నాడు కాలిమీద కాలువేసుకొని లోపల.

"బాబూ! పట్టెడన్నం పెట్టించండీ!" అంది వినేవారి గుండె కరిగేట్టు.

నన్ను కానట్టు ఊరుకున్నాడు యజమాని. కిటికీ రెక్కలు తెరచి ఉన్నాయ్. మెల్లగాచేరింది కిటికీచెంతకు ఆ అమ్మాయి.

మిర్రున చూచాడు కళ్ళెర్రజేసి.

"బాబూ! ప్రొద్దున్నుంచీ మెతుకుల్లేవు నాయనా!! కడుపుకాల్తోంది కాస్త అన్నం పెట్టించండి బాబూ!!!" అందా బాలిక.

"ఫో! పాడుముండా! ఏదీగాని వేళనివచ్చి అరుస్తూ వుంటావం"టూ లేచాడా సంపూర్ణ నిర్దాక్షిణ్యుడు,

"కాసిని నీళ్ళయినా పోయించండయ్యా వాటితోనయినా ఆకలి మంట ఆర్పుకొంటా" నంది. నిరుత్సాహంపడకండా—పాపం,—క్రిందకాళ్ళ పైన నెత్తి మాడుతూ ఉండగా.

"నీళ్ళూ లేవు గీళ్ళూ లేవు ఫో" అని గసిరాడు.

"కాసిని నీళ్ళుకూడ కరువయినవాతండ్రీ! మాకు!!" అంది యిదీ తప్పు.

"ఎన్నిమార్లు చెప్పినా వెళ్ళనంటావేంటే వెధవ్వ" అంటూ నరాలు బిగించుక లేచి కిటికీ రెక్కల్ని దభేలున త్రోశాడు బయటికి. చటుక్కున తగిలిందమ్మాయికి రెక్క. కాలు తూలింది వెనక్కి, కాలానలేదు నేలమీద మొదలు నరికిన చెట్టులా పడిపోయింది గుబేలున దేవుణ్ణి తలుస్తూ అమ్మాయి.

.....................................

"దేవుడూ లేడు దెయ్యంలేదు ఊరుకో చెల్లీ! మన కర్మం యిల్లా కాలింది ఏం చేద్దాం" మంటూ చేతిలో చిప్ప ప్రక్కనఉంచి చిన్నగుడ్డ పేలికతో తుడుస్తున్నాడు గాయాన్నుండికారుతూఉన్నరక్తాన్ని, ఒ కుర్రాడు అప్పుడే పరుగెత్తుక వచ్చి.

అచ్చంగా పోతపోసినట్లు ఆ అమ్మాయిలా ఉన్నాడు, ఆ మేనిచాయ. ఆ ముక్కు తీరు, ఆ కళ్ళ సొగసు అబ్బ ఆ అమ్మాయికూడ అబ్బాయయి నట్లయితే యిద్దరూ రామలక్ష్మణులాఉందురు కవలలయిఉంటారు ఎం చక్కగా ఉన్నారు!

కాస్త కదలి నోరు తెరచిందమ్మాయి. "దాహం" అంటూ వణికాయి పెదివెలు నెమ్మదిగా, వీళ్ళదురదృష్టంవల్ల ఆ దొరికిన కాసిన మెతుకులూ క్రిందికిరాలి చెల్లా చెదరిపోయాయి—అమ్మాయి కాలు చాచినపుడు తగిలి.

శ్రీ "నీలం"

భగభగమని నిప్పులు గ్రక్కుతున్నాడుభాస్కరుడు. ఆ యింటి ఏదుట ఓ పెద్ద ప్రహరీ ఉందిఎత్తుగా, ఆ నీడని తన చెల్లెల్ని చేర్చి అల్లంతదూరంలో చలి పందెర వుంటే అక్కడకుపరుగెత్తాడుచిప్ప చేత్తో పట్టుకొని. ...................................

"బాబూ" కానిన నీళ్ళు పోయండి దాహమవుతుంది." అన్నాడు.

"ఎవడవురా నీవు?" అన్నాడా అక్కడి చలిపందెర అధికారి వీధి నాటకాల్లో రాజన్నట్లు

"మనిషిని. నేనండి కాస్త మంచీళ్ళు పోయండి! అని తొందరజేశాడు.

"అది కాదోయ్! కులం"

"మాల"

"అరి వెధవ!! మాలాణ్ణంటూ వచ్చి మంచీళ్ళు పోయమని మాట్లాడుతున్నావా?" అని కర్ర తీయబోయాడు.

మరణావస్తలో ఉన్న మనుష్యులకు సైతం మంచీళ్ళుపోయని మొనగాళ్ళంతా మహాభక్తులు ధర్మకర్తలున్నూ.

కడుపు కాలుతోంది, అక్కడ చెల్లి అపాయస్థితిలో ఉంది. యిక్కడ వీనితో దెబ్బలు తినడం లాభంలేదనుకొన్నాడు. పాపం నిరుత్సాహంతో నిలువునా నీరయిపోయాడు. అబ్బాయివెంటనే అవతల పశువులు నీళ్ల త్రాగుతున్న ఓ కుండీదగ్గరకు అట్టే పరుగెత్తాడు ఆతృతతో ఒక్కపరుగులో వచ్చి వ్రాలాడు చెల్లి చెంత, కాసినీళ్ళు నోట్లోపోసి, మొఖంమీద కాసిని చల్లాడు సొమ్మసిల్లిన అమ్మాయి కళ్ళుతెరచి "అన్నా! దెబ్బ!!............ అని బావురుమని ఏడువబోయింది. గాయం పెద్దది. "చెల్లీ! మాట్లాడకు ఎందుకు ఏడుస్తావ్, దొరికిన మెతుకులు పోవడం మన దురదృష్టం, ఏం చేద్దాం అమ్మే గాని ఉంటే..........—." యిహ మాట్లాడలేక పోయాడు పొర్లి పొంగే ఏడ్పును దిగమ్రింగి, చెల్లెల్ని లేవదీసి నడువలేక నడుస్తూ పోయారు. ఆ మండుటెండలో, ఎక్కడికో!

* * *

విప్పర్రు రైతుల ఎల్లాలేదన్నా ఓ ఏభై మైళ్ళకు తక్కువలేని దూరం.

అక్కడ రైతులలో కాస్త డబ్బుగలాడు ఒక్క రామయ్య అని చెప్పవచ్చు. వంద ఎకరాల మాగాణీ ఉంది. ఐదుకాళ్ళ ఎడ్లు, కావలసినంత పాడీ ఉంది. రామయ్య. రాఘవయ్యనే కొడుకుతో భార్య లక్ష్మమ్మతో లక్షణంగా జీవిస్తున్నాడు.

నాగయ్య పాలేరుగా ఉన్నాడు రామయ్యదగ్గర. యజమానేమో తనేమో గాని యితరత్రా విషయాల్లో జోక్యం కలుగజేసుకునేవాడుకాడు నాగయ్య. పూర్వకాలపు మనిషవడంచేత కాస్త తెల్లకాఫీ అలవాటుంది.

ఆ ఊళ్ళోవున్న రైతులలో మాటకు మాట పట్టింపువచ్చి చిన్న తగవుగ మారింది. తగవల్లాపోయి ఓ చిన్న యుద్ధంలా పరిణమించింది, ఎవరి పాలేళ్ళకు వాళ్ళు కల్లు కావిళ్ళ రవాణాలు చేశారు. వాటితోపాటు కర్రలు, బుర్రలూ, కత్తులు కటారులు సప్లయిచేసి తప్పుకొన్నారుఎవరిమట్టుకు వారు, యింకేముంది వాళ్ళల్లో వాళ్ళే బుర్రలు పగులగొట్టుకు చచ్చారు పాలేళ్లు. ఆ చచ్చినవారి పట్టీలో నాగయ్యపేరు మొదటపడిందని వేరే చెప్పక్కర్లేదు. త్రాగుబోతని కాదు—ప్రభుభక్తి!

పాపం నాగయ్య చచ్చేటప్పటికి పెళ్ళాం అచ్చమ్మనిండు చూలాలు. పంపా ఏడ్చేడ్చి ఊరుకుంది. ఏం జేస్తుంది!

ఓనాటి రాత్రి నొప్పులు కలిగాయి అచ్చమ్మకు, చుట్టుప్రక్కల అమ్మ లక్కలు వచ్చి సహాయపడ్డారు. అచ్చమ్మకి: కవలబిడ్డలు పుట్టారు.

ఓ మగశిశువు. ఓ ఆడశిశువు. నీళ్ళుపోసి "నారాయణ, నరసమ్మ" అని పేర్లు పెట్టారు.

యింతలో కేసు బనాయించారు రామయ్య ఎదురు పార్టీవారు. వారంటు వచ్చింది. ఆబద్ధపు సాక్ష్యం చెప్పమన్నాడు యజమాని రామయ్య "నాకేం తెలీదు బాబూ! నేను చెప్పనం"ది అచ్చమ్మ.

ఎప్పుడో ఒకప్పుడు అచ్చమ్మ భర్త ఐదో, పదో, రూపాయలు అప్పు తీసుకొన్నాడని దానికి వడ్డీలు, గిడ్డీలు పెట్టి అసలుతో సహా తీర్చేయమన్నాడు అప్పు యజమాని. అచ్చమ్మ అబద్ధపు సాక్ష్యం చెప్పనందుకు కులం తక్కువయితే గుణంలో తక్కువవుతారా? అచ్చమ్మెంతో భయపడింది బ్రతిమలాడింది. లాభంలేక పోయింది. నాగయ్య తనకుచేసిన సేవను మరచిపోయి అప్పు రాబట్టుకొంటానికి ఆ పూరియిల్లును వేలంవేయించాడు దౌర్జన్యంగా, అడిగే మగాడేడీ ఆ మాలపల్లెలో?

ఓ యాభై రూపాయలు వచ్చాయ్ వాటితోనయినా కడుపు నిండిందో? లేదో ఆ మోతుబరికి!

అచ్చమ్మకు నా అన్నవాళ్ళెవళ్ళూ లేకపోయారు ఆ పిల్లలిద్దరూ తప్ప.

పాపం వీళ్ళిద్దర్నీ ఎలా పోషించాలాఅని విచారంతో కృంగి కృశిస్తూ ఆ యిద్దరి పిల్లల్తో ఆ పంచనీ యీ పంచనీ ఉంటూ కూలీచేసి పిల్లల్ని పోషిస్తూ వచ్చింది కొంతకాలం,

ఓనాటి రాత్రి అంతులేని కడుపునొప్పి వచ్చేసింది అచ్చమ్మకు. ఎవరికి చెప్పినా లాభంలేదు. ఆర్చేవారా తీర్చేవారా? అర్థరాత్రి. దాంతో గడచిన సంగతులన్నీ పరుగులెత్తుక వచ్చాయి బుర్రలోకి. దానితో జీవితంమీద విసువెత్తింది అచ్చమ్మకు. పిల్లలభారం అంతా భగవంతునిపైన ఉంచింది. వాళ్ళను విడువలేక విడచి కొంతసేపు ముద్దులాడి దీవెనలిచ్చి ఊరికి సమీపంలో ఉన్న నూతిలోపడి గంగలో కలిసిపోయింది,

తెల్లవారింది పిల్లలు లేచారు. కనుపడలేదుఅమ్మ. గగ్గోలెత్తారు "అమ్మా! అమ్మా!!" అని, ఎక్కణ్ణుంచి వస్తుంది అమ్మ ఎక్కణ్ణుంచి వస్తుంది జవాబు? ఎవరు వింటారు వాళ్ళ ఏడ్పుల్ని? వాళ్ళకేసి చూచేవారే లేకపోయారు,

అప్పటికారేళ్ళు యిద్దరికీ. విప్పర్రును విడచి బయల్దేరారు ఎక్కడికో? వాళ్ళకే తెలీదు. పాపం!

ఒకొక్కక్క ఊరు దాటుకొంటూ అయిదు రోజులకో ఆరు రోజులకో చేరుకొన్నారు. వేమగిరిని ఆ పసికందు లిద్దరూ.

అక్కడ మాత్రం అమ్మ ఉందా?" ఆదరించే వాళ్ళున్నారా?

అక్కడే ఏ చెట్టుక్రిందో ఏ అరుగుమీదో రాత్రులుపడుకొంటూ పగలంతా తిరిగి పట్టెడన్నం తెచ్చుకొని తింటూ వుండేవారు. యిద్దరున్నూ యిల్లా ఉండగా గిర్రున తిరిగింది కాలచక్రం కాలచక్రంతోపాటు పన్నెండు వత్సరాలు పరుగెత్తుకవచ్చాయి మళ్ళీ తిరుగుతుంది యిది పదమూడో ఏడు యిద్దరికిన్నీ.

ఓనాడు మధ్యాహ్నం వేమగిరివీధిలో ఓ యింటిముందు నిరుత్సాహులై నిరాధారులై నా యన్నవాళ్ళులేక మండుటెండలో మ్రగ్గుతూ ఆ మార్గాని నడిచిపోతూ ఉన్న ఆ బాలబాలికలే ఆ నిర్భాగ్యజీవులే "నారాయణ, నరసమ్మలు అచ్చమ్మకు కల్గిన క వ ల పి ల్ల లు.